# సెలూన్‌బాబు!

సెలూన్ బిజినెస్‌ను కొత్తపుంతలు తొక్కించి దేశవ్యాప్తంగ సంచలనం సృష్టించిన నాగన్నబాబులో... వ్యాపారంపట్ల అతనికి గల అనురక్తి పట్టుదల కార్యదీక్షను గుర్తించిన భారత ప్రభుత్వం... అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'సెలూన్ శ్రీ' బిరుదు తొలిసారిగ అతనికి ప్రదానం చేయటం ఆ వ్యాపారవర్గాల్లో కలవరం సృష్టించింది.

వ్యాపారాన్ని హిమాలయాలంత ఎత్తుకు తీసుకెళ్ళి కోట్లకు అధిపతి అయిన బాబుని చూచి ఛోటామోటా సెలూన్ వర్గాలవారు అసూయపడ్డారు!

సెలూన్ బిజినెస్‌ను కార్పోరేట్ రంగస్థాయికి చేర్చిన ఘనత అతనికే దక్కింది!

అయినవారు... మిత్రులు... బంధుజనం... అభిమానులు... ముద్దుగ 'సెలూన్‌బాబు' అని పిల్చుకోవడం చూస్తూ యావన్మందీ ముచ్చటపడ్డారు.

నాగన్నబాబు పేరు కనుమరుగై... సెలూన్‌బాబు అనే పేరు స్థిరపడింది!

ఇండియాలో సెలూన్ ప్రొఫెషన్ సబ్జక్ట్‌లో ఎం.బి.ఏ. చేసి విదేశాలు వెళ్ళి అక్కడ మరెన్నో డిప్లమోలు డిగ్రీలు సాధించి మాతృభూమికి తిరిగొచ్చిన బాబు వంశపారంపర్యంగ వస్తున్న క్షురకర్మ వృత్తిని పెంపొందించాలనే సదాశయంతో... జంట నగరాల్లో అత్యంత అధునికమైన పద్ధతుల్లో హైక్లాస్ సెలూన్స్ ప్రారంభించాడు.

దేశానికి స్వాతంత్ర్యం రాకపూర్వం... బ్రిటీష్‌వారు పాలిస్తున్న రోజుల్లో దొరలకు మస్కా కొట్టి వారికి మాలిష్ చేయటం ప్రారంభించిన బాబు తాతముత్తాతలు... తెల్లవారికి క్రాఫులు చేసే స్థాయికి ఎదిగి వచ్చీరాని ఇంగ్లీషు పదాలు నేర్చుకుని వారిని పొగడ్తలతో అకాశానికి ఎత్తేస్తూ... వారి షేవింగ్ క్రీములనే వాడుతూ... కత్తులను తళతళ మెరిసేలా నూరి అతి సుకుమారంగ వారి గడ్డాలు గీస్తూ... క్రాఫులు చేస్తూ తెల్లదొరల అభిమానాన్ని పొంది వారు విసిరే కాసులు రొంటిన దోపుకుని... ఈనాములు సైతం పొంది... ఆస్తులు కూడబెట్టుకున్నారు.

దొరలు దేశాన్ని వదిలి... పాలన మనపరం చేసిపోయాక... సిటీల్లో దేశమంతటా అక్కడక్కడ దొక్కుటెపు చిన్నసైజు క్షవరశాలలు వెలవనారంభించినయ్.

అలా అలా బాబు వంశీకులు క్రమంగా హైదరాబాద్ చేరుకుని స్వతంత్రంగ సెలూన్ వ్యాపారాన్ని కొనసాగిస్తూ వచ్చారు.

ఆ ఫామిలీలోని వాడే నాగన్నబాబు వురఫ్ 'సెలూన్‌బాబు'.

గురివిగాడు అనబడే గురవయ్యకు ఏకైక సంతానం నాగన్నబాబు కావటంతో... కొడుకు చంకలో 'మంగలిపొది' పెట్టకుండా బాగా చదివించాడు.

పెద్ద చదువు చదివినా ఉద్యోగంకోసం పాకులాడని నాగన్నబాబుకి కొత్త కొత్త ఆలోచన్లు మనసులో చోటు చేసుకోవటంతో వృత్తిని మోడరనైజ్ చేయాలనే తలంపుతో విదేశాల్లో వృత్తిస్థాయి స్థితిగతులు ఆకళింపు చేసుకుని భారతదేశంలో కూడా అభివృద్ధి సెలూన్ వ్యాపారంలో సాధించాలనే పట్టుదలతో స్వదేశం వచ్చాడు.

కత్తి కత్తెరకాలం చెల్లిపోయిందనే సత్యాన్ని నిరూపించాడు బాబు! విదేశీ పరిజ్ఞానంతో ఆధునీకరించిన సెలూన్ సెంటర్స్‌ని నెలకొల్పాడు.

ప్రచారంలేనిదే ఏ వ్యాపారము విజయం సాధించలేదనే నగ్నసత్యాన్ని తెల్సుకున్నవాడై... తన సెలూన్లో గల సదుపాయాల గురించి న్యూస్‌పేపర్స్‌లో ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలు గుప్పించి ప్రచారం చేసాడు.

ప్రజల నాడి తెల్సిన బాబు నిర్వహణలో గల సెలూన్ సెంటర్స్ అన్నింటిలోనూ ఎయిర్ కండీషన్ సదుపాయం కలిగించాడు.

కస్టమర్స్‌కు వాడే పౌడర్లు... షేవింగ్ క్రీమ్‌లు... లోషన్లు... అన్నీ ఘుమఘుమ వాసనలు వెదజల్లే ఇంపోర్టెడ్‌వే కావటం మరో విశేషం. జనాకర్షణ సదుపాయాలను కలుగచేసి కృతకృత్యుడు కాగలిగేడు.

అన్నీ గ్లాస్ డోర్సే! వాటిని రిమోట్ ద్వారా ఆపరేట్ చేయటం నగరవాసులకు కస్టమర్లకు విస్మయాన్ని కలిగించింది.

సెలూన్ సెంటర్స్‌లో టి.వీ.లున్నయ్. టెలిఫోన్ సౌకర్యముంది. లోపల అంతా గ్లాస్‌వేరింగే! వివిధ భంగిమల్లో విదేశీ మగువల అర్ధ నగ్నచిత్రాలు చూపరులను మరులుగొలుపుతూంటయ్.

మగవారికి సైతం విద్యావంతులైన స్త్రీలే షేవింగ్ కార్యక్రమం నిర్వహించటం కాస్త కొత్తల్లో ఇబ్బందిగా పురుషులు ఫీలైనా... అటు తర్వాత ఎగబడి క్యూ కట్టారు.

సెలూన్‌లు ఎల్లవేళలా కిటకిటలాడుతూంటయ్ కనుక ఎడ్వాన్స్ రిజర్వేషన్ సిస్టమ్‌ని ప్రవేశపెట్టాడు. ఫోన్ ద్వారా తమ టోకెన్ నంబరు ఏ సెంటర్‌కి ఏ తేదీన ఎన్ని గంటలకు రావాలనేది తెలీపర్చబడే సదుపాయం వుండటం అనేకమంది కస్టమర్స్‌కి సంతోషాన్నిచ్చింది.

లేడీ వర్కర్లందరికీ ఒకే రకమైన యూనిఫామ్ వుండాలని నిర్ణయించిన బాబు అందరికీ తనే కొత్తగ జాబ్‌లో జాయిన్ అయేటప్పుడు యూనిఫామ్ ఇవ్వటమనే విధానం

వర్కర్స్‌లో సంతోషాన్ని కలిగించింది.

క్షురకులైన ఏ ఒక్క వర్కర్‌కు పదివేల రూపాయలకు జీతం తక్కువ లేకపోవటం చూచి ఎందరో ముక్కున వేలేసుకున్నారు.

ఒక్కసారి బాబు సెలూన్ సెంటర్లో అడుగు పెడితే... ఆజన్మాంతం అక్కడికే వెళ్ళాలనే కోరిక కస్టమర్స్‌లో కలిగే విధంగా వుంటుంది.

దటీజ్ సెలూన్‌బాబు!

★ ★ ★ ★ ★

అరడజను సెంటర్స్ ప్రారంభించిన బాబు ఏడాది తిరక్కుండానే మరో ఇరవై సెలూన్ సెంటర్స్‌ను ప్రారంభించేస్థాయికి ఎదిగేడు.

జనం వేలంవెర్రిగా రావటం... వ్యాపారం వృద్ధికావటం చూస్తున్న చాలామందికి కళ్ళు ఎర్రబడ్డయ్.

గడ్డానికి వంద... క్షురకర్మకు రెండువందలు... హెయిర్ డైయింగ్‌కు నూటయాభై ఛార్జ్ చేస్తున్నా... ధరలనెవరూ కేర్ చేయని స్థితి. సెలూన్‌లో కాస్సేపు కాలక్షేపం చేసినా అక్కడి వాతావరణం... సుగంధ పరిమళాల సువాసనలను అఘ్రాణించటానికే కస్టమర్స్ ఎగబడుతున్నారు.

పేరున్న సినిమానటులు... దర్శక నిర్మాతలు... అధికార ప్రతిపక్షాల నేతలు... అధికారులు సైతం బాబు సెలూన్లను చూచి ముచ్చటపడుతూ అక్కడి కొచ్చేవారే!

తన సెలూన్స్‌లో పనిచేసే వర్కర్లెవరూ సిటీబస్సులో రావటానికి వీల్లేదని శాసిస్తూ వారికి టూవీలర్స్ కొనిచ్చి వాటి ఖరీదు వాయిదాల పద్ధతిలో శాలరీలో రికవరీ వుంటుందని వివరిస్తూ... స్కూటర్లకు అయ్యే పెట్రోలు ఖర్చు సంస్థే భరిస్తుందనీ వివరంగ తెలీచెప్పటంతో మహిళా వర్కర్లంతా తమ సంతోషాన్ని వెలిబుచ్చారు.

ఏడాదికి రెండు విడతలుగా డి.ఏ. పెంపు... సంవత్సరానికో ఇంక్రిమెంట్... క్యాజువల్లీవులు... మెటర్నటీ లీవులు సైతం ఇవ్వటానికి సంస్థ సిద్ధంగా వుందని వుమన్ వర్కర్స్‌కి తెలీచేశాడు.

మరో ఏడాది గడిచేసరికి సెలూన్‌బాబుకి సరికొత్త ఆలోచన అతని బుర్రని కుమ్మరి పురుగలా తొలిచింది. కొత్త కోణంలోంచి వ్యాపారాభివృద్ధి చేయాలనే సంకల్పంతో... కస్టమర్ల కన్వీనియన్స్‌కోసం ప్రయాసపడుతూ వారు సెలూన్ సెంటర్స్‌కు రాకుండానే మొబైల్ యూనిట్స్ ప్రక్రియకు శ్రీకారం చుట్టాలనే నిర్ణయానికొచ్చాడు.

ఇంకేముంది? ఆలోచన వచ్చిందే తడవు ఓ యాభై మొబైల్ వ్యాన్స్ (ఆరోగ్యశ్రీ 108 అంబులెన్స్‌ల్లాగ) కి ఆర్డరిచ్చి అన్నింటిలోనూ సర్వ సదుపాయాలు ఏర్పరిచి... ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజి ద్వారా అభ్యర్థులను ఎంపికచేసి రిక్రూట్‌మెంట్ ప్రక్రియ పూర్తిచేశాడు.

ఎక్స్‌పరమెంటల్ బేసిస్ మీద మొబైల్ వాన్స్‌ను ప్రముఖమైన కాలనీలలో సంచరించేటందుకై కేటాయించటం జరిగింది.

ఇది ఉత్తమోత్తమమైన ఆలోచనగా పత్రికలనీ అభివర్ణించినయ్. సెలూన్‌బాబును ఆకాశానికి ఎత్తేస్తూ పొగడ్తలతో ముంచెత్తినయ్.

సెలూన్‌బాబుని... సెలూన్‌వాన్స్‌నూ ఎలక్ట్రానిక్ మీడియా చిత్రీకరించి టి.వి.ల్లోనూ చూపి వ్యాపారానికి ఇతోధికంగ తోడ్పడినయ్.

సెలూన్ బిజినెస్‌లో బాబు అలంభించే వినూత్న పద్ధతులకు ఛోటామోటా క్షౌరశాల నిర్వాహకులు నోరెళ్ళబెట్టి గుడ్లు మిటకరిస్తూండిపోవలసి వచ్చింది.

క్రమేపీ అధునాతన పద్ధతులతో విస్తృతమౌతున్న సెలూన్ బిజినెస్ జిల్లాలకు సైతం ఎగబాకటంతో కంపెనీ ఏక్ట్ పద్ధతుల ననుసరించి లిమిటెడ్ కంపెనీగా రూపుదిద్దుకుంది.

ప్రతి జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో ఒక బ్రాంచి మేనేజర్ని అపాయింట్ చేసి... డే-టు-డే పర్యవేక్షణ, పవర్స్ వారికి డెలిగేట్ చేసి తాను మాత్రం పీరియడికల్ ఇన్స్పెక్షన్‌కి వెళ్ళి చూసొస్తూ అవసరమైన సలహాలు మాత్రమే ఇస్తూ సంస్థ ఎం.డి.గ వ్యవహరిస్తున్నాడు.

సంస్థ పెరుగుతోంది. శాఖోపశాఖలుగ విస్తరిస్తోంది. ఉద్యోగుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. వ్యాపారంలో లాభాలు అధికమౌతున్నయ్.

సంచార గ్రంథాలయాలు... అంబులెన్స్‌లను మాత్రమే చూచిన ప్రజానీకానికి సెలూన్ బిజినెస్‌ని సైతం ఈవిధంగ మొబైల్ క్షౌర వెహికల్స్ విధానాన్ని ప్రవేశపెట్టటం చూసి... క్రమేపి ఈ సదుపాయాలను వినియోగించుకోవటానికే ఇష్టపడుతున్నారు అంతా!

ఎదిగేకొద్దీ ఒదిగి వుండాలనే థియరీకి కట్టుబడినవాడు సెలూన్‌బాబు! రాష్ట్రంలోనే బాబు అత్యంత ధనవంతుల్లో ఒకడైనాడు! అతని వ్యాపార ఆర్థిక సలహాదారులుగా ఇద్దరు ప్రముఖ ఆడిటర్లను అపాయింట్ చేశాడు. రాబడి.... మీద కట్టవలసిన ఆదాయం పన్నుల తాలూకు వ్యవహారాలు... ఏటా ఐ.టీ. రిటరన్స్ సకాలంలో ఫైలింగ్ బాధ్యతలను సంపూర్ణంగ ఆడిటర్స్‌కే అప్పగించాడు బాబు!

★ ★ ★ ★ ★

అన్ని సెలూన్ సెంటర్స్‌లోనూ రాష్ట్రవ్యాప్తంగ క్రెడిట్ కార్డ్సును అంగీకరించే పద్ధతిని సైతం ప్రవేశపెట్టటం జరిగింది. కస్టమర్స్ ధనికవర్గంవారు కాష్‌కారీ చేసుకునే పద్ధతి తప్పినందుకు సంతోషించారు.

మొబైల్ సెలూన్ వేన్స్ యాక్టివ్‌గ పనిచేస్తున్నాయో లేదోని ఇన్స్పెక్ట్ చేయటానికి తాలూకాల్లో బ్రాంచీల నిర్వహణ విషయాలు పరిశీలించటానికి బ్రాంచి మేనేజర్లందరికీ సంస్థ ఖర్చుతో మారుతీ/నానో కార్లను ప్రొవైడ్ చేయబడినయ్.

నెలసరి ఆదాయం కోట్లలోకి గెంతుకు రావటంతో సెలూన్‌బాబు తన ఆలోచన్లకు మరింత పదునుపెట్టి... సెలూన్ సెంటర్లను ఇతర రాష్ట్రాలకు కూడా వ్యాప్తి చేయాలని నిర్ణయించుకున్నాడు.

దేశంలో గల అన్ని రాష్ట్రాలు... జిల్లాలు తాలూకాలు పర్సనల్‌గ సర్వే చేసి బిజినెస్ ఎసెస్‌మెంట్ నిర్వహించి... అన్నిచోట్లా లాభదాయకంగానే వుండగలదనే ఆశాభావంతో తన వ్యాపారాన్ని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా కొనసాగుతున్న దాన్ని పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగ మార్చటానికి అవసరమైన చర్యలన్నీ త్వరితగతిన పూర్తిచేశాడు. పబ్లిక్‌ని ఈ వ్యాపారంలో షేర్ హోల్డర్స్ చేయాలనేదే సెలూన్‌బాబు ముఖ్య వుద్దేశం. తద్వారా అనేకమంది నిరుద్యోగ యువతకు... విద్యావంతులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనేదే అతని ఆశయం!

షేర్‌వేల్యూ పదిరూపాయలే అయినా తన అంచనాలకు మించి ప్రజాదరణ లభించినందుకు పొంగిపోయాడు. పదివేల కోట్ల ధనాన్ని షేర్‌కేపిటల్ ద్వారా సమీకరించగలిగేడు.

మొత్తానికి తన ప్లాన్ సక్సెస్ అయింది. పబ్లిక్ రంగంలోకి దిగిన టాటా-బిర్లా-రిలయన్స్- బజాజ్ వంటి ప్రముఖ సంస్థలు ఇలాంటి ప్రయత్నం తాము చేయలేకపోయినందుకు మనసులో బాధపడ్డారంటూ దినపత్రికలలో పతాక శీర్షికలో వార్తలు రావటం చూచిన సెలూన్‌బాబు ఆనందానికి అవధుల్లేకుండా పోయినయ్.

ఒకప్పుడు రాష్ట్రంలో... ఇప్పుడు దేశంలో గల బడా వ్యాపారస్తుల సరసన తనూ ప్రముఖస్థానంలో వుండగల స్థాయికి చేరుకోగలిగినందుకు గర్వించాడు సెలూన్‌బాబు!

- సమాప్తం -